క్లుప్తంగా

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



జమ్మానిపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లిలో ఆదివారం వైద్య సిబ్బంది ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటూ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అలాగే నోటి క్యాన్సర్, చర్మ, కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. గుర్తించిన వ్యాధులకు వైద్య చికిత్స నిర్వహిస్తామన్నారు. ఏఎన్‌ఎం ఉషాలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ముఖ్యంగా గుట్కా, మద్యం, స్మోకింగ్ లాంటి వాటిని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సౌజన్య, వైద్య సిబ్బంది , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీహెచ్‌ఓగా ఏఎస్‌ఎల్ బాబు



పావగడ: స్థానిక తాలూకా ప్రభుత్వ ఆస్పత్రి టీహెచ్‌ఓ (తాలూకా ఆరోగ్య అధికారి)గా స్థానిక సీనియర్ ప్రభుత్వ వైద్యుడు ఏఎస్‌ఎల్ బాబు నియమితులయ్యారు. గతంలో ఆయన స్థానిక ప్రభుత్వాస్పత్రి పాలనాధికారిగా విధులు నిర్వహించే వారు. ఇంత కాలం టీహెచ్‌ఓగా ఉన్న డా కిరణ్‌ను తప్పించి ఏఎస్‌ఎల్ బాబుకు ఆ బాధ్యతలు అప్పగించారు. దీనికి సంబంధించి తుమకూరు జిల్లా డీహెచ్‌ఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలందిస్తామని నూతన టీహెచ్‌ఓ ఏఎస్‌ఎల్ బాబు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో మైనార్టీలకు ఇబ్బందులు

పెనుకొండ: వక్ఫ్ సవరణ బిల్లుతో మైనార్టీలకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని పెనుకొండ నగర పంచాయతీ కోఆప్షన్ మెంబర్ నేమతుల్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీలను ఒక ప్రణాళిక ప్రకారం దెబ్బతీయాలన్న లక్ష్యంతో ఎన్‌డీఏ ప్రభుత్వం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. అనేక పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం బిల్లును బలవంతంగా ఆమోదింపజేయడం సరికాదన్నారు. సమాజంలో విభజన విత్తనాలు నాటడానికి, ముస్లింలను వేధించడానికి, వారి భూములు కార్పొరేట్‌లకు దారాధాత్తం చేయడానికి బిల్లును పాస్ చేశారన్నారు. ఏపీ ప్రభుత్వం సైతం ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు మైనార్టీల పట్ల ఉన్న ప్రేమను తెలియజేస్తోందన్నారు.

వసూరమ్మదేవికి ఎమ్మెల్యే పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

పావగడ: తాలూకాలోని లింగదహళ్లి జే పాళ్య గ్రామంలో వెలసిన ఆదిశక్తి వసురమ్మదేవి దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆదివారం దర్శించుకున్నారు. తమ ఇంటి దేవత అయిన వసురమ్మదేవికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు..



రొద్దంలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రొద్దం: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు కేతఈ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ స్థాపన దివాస్ జిల్లా కో కన్వీనర్ నీరుగంటి వేణుగోపాల్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గంగాధరప్ప, మహదేవ, ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యాక్షుడు తిప్పేస్వామి, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరికి గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి తాండ సమీపంలో ఆదివారం ఎడ్ల బండ్ల పోటీల బందోబస్తుకు వచ్చిన ఏఆర్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరిపై ఎడ్ల బండి ఎక్కింది. ఈ ఘటనలో పుట్టపర్తి మండల ఇరగరాజుపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజుతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే స్థానికులు 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జై శ్రీరామ్

శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాలను నిర్వహించగా పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఆ వేడుకను చూసి తరించారు. అన్ని ప్రాంతాల్లోనూ పండుగను పురస్కరించుకొని భక్తులకు పానకాన్ని పంపిణీ చేశారు.

- అత్యంత వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- సీతారాముల కల్యాణం, ఊరేగింపుతో పల్లెల్లో సందడి
- అన్నిచోట్లా పెద్ద ఎత్తున పానకం పంపిణీ



అమరాపురం మండలం దక్షిణ గొల్లహట్టిలో శ్రీరాముడికి పూజలు చేస్తున్న భక్తులు



హిందూపురం: ఉట్లమాను ఎక్కుతున్న యువకులు



గోరంట్ల మండలం కరావులపల్లిలో..



సోమందేపల్లి మండలం జాలకుంటలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తుల పూజలు



లేపాక్షి మండలం పులమతిలో రామయ్య రథోత్సవం

హిందూపురం: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పట్టణ, మండల పరిధిలోని పలు చోట్ల రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు సీతారాముల కల్యాణోత్సవాలు కనుల పండువాల సాగాయి. సూగురు ఆంజనేయస్వామి ఆలయం భక్తుల కిటకిటలాడింది. సీతారాముల కల్యాణంతో పాటు రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. లంకా దహనం కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వీక్షించారు. పట్టణంలోని పేటవెంకరమణ స్వామి, ఆంజనేయస్వామి, బాలాజీ ఆలయాల్లో సీతారామ కల్యాణోత్సవాలు జరిగాయి.



పెనుకొండ మండలం పెద్ద చెరువుకట్టలో సీతారాముల కల్యాణం జరిపించిన దృశ్యం

పెనుకొండ: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక రామభద్రాలయంలో స్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది.అలాగే మిట్టాంజనేయస్వామి దేవాలయంలో మంత్రి సవిత స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

లేపాక్షి: మండలంలోని పులమతిలో సీతారాముల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పురోహితులు, బ్రాహ్మణులు హోమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుంచి రథోత్సవం వరకూ మోసుకుని వెళ్లి రథోత్సవంలో కొలువు తీర్చారు. దేవాలయం నుంచి బస్టాండు ఆంజనేయస్వామి విగ్రహం వరకూ ఊరేగించారు. మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూలకుంట గ్రామంలో ఆంజినేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈదుకబలాపురంలో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు పానకాలు, పెసర బ్యాళ్లు పంపిణీ చేశారు. చెన్నాపురంలో జరిగిన నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

అమరాపురం: మండలంలో శ్రీరామ నవమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. అమరాపురంలోని వినాయకనగర్, ఆంజనేయస్వామి ఆలయం, దక్షిణ గొల్లహట్టి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. గౌడనకుంట, తమ్మడేపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లిలో



రొళ్ల: అలంకరణలో సీతారాములు

ఆదివారం సీతారాముల ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే రామస్వామిదేవాలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కమణీయంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణం వీక్షించారు.

పెనుకొండ రూరల్: పెద్దచెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం పూజల అనంతరం అభిజిత్ లఘ్నంలో సీతారాములు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పావగడ: స్థానిక కోటె ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతా రామ లక్ష్మణులకు ఆలయ అర్చకుడు రమేశ్ స్వామి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవ కార్యక్రమం చేపట్టారు.

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన శ్రీరామ ఆలయం, రత్నగిరి గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి, మల్లసముద్రం రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. టీడీ పల్లి, హెచ్‌ఎం పల్లి బైలాంజనేయ స్వామి, ఎంఆర్ గొల్లహట్టి, కొడగార్లగుట్ట, జీబీ హళ్లి, గౌట్టుగుర్కి, గుడ్డగుర్కి, జీఎస్ పాళ్యం, ఆర్.రంగాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి.

చిలమత్తూరు: శ్రీరామనవమి పండుగను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని రామాలయాల్లో సీతారాముల వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఇష్టమైన పానకం, పెసరు బేడలను పంచి పెట్టారు.

మడకశిరరూరల్: మడకశిర మండలంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రఘువీరారెడ్డి శ్రీరాముని పాదాలను తలపై పెట్టుకుని మోశారు. సీతారాములకు ఉయ్యాల సేవ, కలశ స్థాపన నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో పేటవెంకట రమణస్వామి

పరిగి: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండలంలో ఆదివారం పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలోని శ్రీరాముని, ఆంజనేయస్వామి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం పలు గ్రామాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రొద్దకాంబదేవి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీరామ భక్త మండలి, రొద్దకాంబ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని ఫలారంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి మూల విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెసరు బ్యాళ్లు, పానకం అందించారు.

అగళి: మండల వ్యాప్తంగా ప్రజలు శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోని శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం, పెసర బేడలు పంపిణీ చేశారు.



హిందూపురం: అలంకరణలో సూగురు ఆంజనేయస్వామి



నీలకంఠాపురంలో సీతారాములకు ఉయ్యాల సేవ నిర్వహిస్తున్న దృశ్యం



అలంకరణలో ఆలూడి ఆంజనేయస్వామి



పావగడ: ప్రసాదాన్ని పంచుతున్న శ్రీరామ సేన పదాధికారులు



పెనుకొండ: మిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి సవిత



హిందూపురం: లంకా దహనాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



హిందూపురంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా



లేపాక్షి: ఎస్సీ కాలనీలో ముత్యాలమ్మ ఊరేగింపు

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

అమరాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 8న రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలానికి వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. ఇందులో భాగంగానే పార్టీ శ్రేణులు ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మడకశిర నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మాజీ డీలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఆదివారం ఆయన అమరాపురం మండలం ఆరోనపల్లి గ్రామంలో జరిగిన శుభ కార్యానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఈరలక్కప్ప మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలంలో ఇటీవల హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ వస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మడకశిర, గుడిబండ, అమరాపురం, రొళ్ల, అగళి మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహప్ప, పాండెప్ప, మంజునాథ, నాగన్న, సిద్దేశ్వర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

ఘనంగా గంధం వేడుకలు

పెనుకొండ: పట్టణంలోని గోనిపేట రోడ్డులోని ఖమ్రుద్దీన్ ఆలీబాబా దర్గాలో ఆదివారం స్వామి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. దర్గా సర్కిల్ నుంచి ప్రత్యేక రథంలో గంధాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామి వారి సమాధి వద్ద సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి సమాధిని, దర్గాను సుందరంగా అలంకరించారు. వేలాది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌ఐ. వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ప్రజలు తమ సమస్యలు ఏమైన ఉంటే అర్జీల రూపంలో సమర్పించుకోవాలన్నారు.

నాటుసారా స్వాధీనం

ముదిగుబ్బ: అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆధ్వర్యంలో ఆదివారం గరుగుతండాలో నాటుసారా స్థావరాలపై దాడులను నిర్వహించారు. ఈసందర్భంగా 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు నరసింహులు, శ్రీరాములు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సునంద, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, పుట్టపర్తి, ధర్మవరంఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చంద్రమణి, ఎస్‌ఐ చాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	36.0
పెనుకొండ	37.0
మడకశిర	36.0

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



కరావులపల్లి తండా సమీపంలో ఎడ్ల బండ్ల పోటీలు జరుగుతున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి తండా సమీపంలో వెలసిన శివఅంజన్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయ ధర్మకర్త సునీత శంకర్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీల్లో 61 మంది రైతులకు చెందిన ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మంత్రి సవిత చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. మండల పరిధిలో ఖాజాపురంకు చెందిన రైతు కుళ్లాయప్ప , బూచేపల్లికి చెందిన బూలేట్ సావకారి , పుట్టపర్తికి చెందిన వజ్రమణికి చెందిన వృషభాలు మొదటి, రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి.

సందడిగా రాతిదూలం పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల: స్థానిక మరువ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం గోల్డ్ షాపు యాజమాని నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు జరిగాయి. కడప జిల్లాకు చెందిన రైతు వీరాంజినేయులు వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే మేడాపురానికి చెందిన వెంకటేశు, చెన్నేకొత్తపల్లికి చెందిన రైతు నాగరాజు చెందిన వృషభాలు రెండు, మూడోస్థానాలను దక్కించుకున్నాయి. రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదును విజేతలకు అందజేశారు. మంత్రి సవిత చేతుల మీదుగా విజేతగా నిలిచిన ఎద్దుల యజమానులకు బాహుమతులు ప్రదానం చేశారు.